# ఆదర్శమూర్తి

రచన :
శ్రీ గోటేటి శ్రీరామారావు.

ఆశయమనేది అందరికీ వుంటుంది. కాని అద్దానిని అక్షరాలా నెరవేర్చిన వాడే ఆదర్శమూర్తి యనిపించుకుంటాడు. ఈనాడు ప్రజాపాలనం వచ్చినతరువాత ప్రతీ ఒక వ్యక్తీ ఆదర్శమూర్తిగానే చెలామణీ యవుతూండటం వలన ఎవడు నిజమైన ఆదర్శమూర్తి యనేది గ్రహించలేకపోతున్నాం

ఆనంద్ పూర్వులు బాగా వున్నవారే–! అయితే నేతిబీరకాయ సామ్యంలా ఆ వుందేదంతా హరించి పోయింది. ఇహం మిగిలిందల్లా ఎం. బి. బి ఎస్ డిగ్రీ మాత్రం. ఆ డిగ్రీని పట్టుకుని ఏ పట్నంలోపోతే బాగుపడేవాడు – పోయిందంతా రాబట్టుకునేవాడు. కాని ఆశయం ఆశయాలంటూ తాను పుట్టిన పల్లెలోనే ప్రాక్టీసును ఆరంభించాడు.

పల్లెలో అంత డబ్బుపోసి వైద్యం చేయించుకొనే వాళ్ళెవరు చెప్పండి – రుద్రజడాకు రసం పోస్తే చెవిపోటు పోతుందనీ – మరో కొంతిరసం పట్టుకొస్తే వాపు తీస్తుందనీ – అనుకునేవారే కాని – దమ్మిడీ ఖర్చుపెట్టి డాక్టరు తావుకు రారు. పైగా వాళ్ళతావు అంతగా డబ్బూ దస్కం వుండదు కూడా.

—అయినా ఆనంద్ తన ప్రాక్టీసును ఆ పల్లెలోనే పెట్టాడు. ఎల్. ఎం. పి. చదువుకున్న కుమారి చంద్ర అతని వద్ద సహోద్యోగిగా చేరింది. బీదసాదల చికిత్సల విషయంలోనే ప్రత్యేక శ్రద్ధను తీసుకుంటూ, డబ్బిచ్చినా యివ్వకపోయినా వారి సేవలోనే నిరంతరం నిమగ్నుడవడం జూచి చంద్ర ఒక రకంగా ఆనంద్‌ను అనుమానిస్తుంది. ఇదంతా రాజకీయ పలుకుబడిని సంపాదించడానికి చేస్తున్న యెత్తు అనుకుంటుంది. కావడానికి యీనాటి రాజకీయ వేత్తల్లో డాక్టర్లూ, ప్లీడర్లూ యెక్కువ కాబట్టి – ఆమె సందేహానికి తావును కల్పించింది.

క్రమేణా రోజులు గడిచి వారాల్లోకి, వారాలు గడిచి నెలల్లోకి, నెలలు వెళ్ళి సంవత్సరాలలోకి తిరగడం – ఎన్నికలు జరగడం – అతడు కిమ్మన్నాస్తిగా ఏ పార్టీ సభ్యత్వాన్నీ పరిగ్రహించడంగాని, ఏ ఎన్నికల్లోనూ పాల్గోవడం కాని చేయకపోయేసరికి – చంద్ర అతనిపై తనకుగల దురభిప్రాయాన్ని మార్చుకుంటుంది. ఆనంద్ చేస్తున్న మానవసేవను ప్రశంసిస్తూ, తన శేష జీవితాన్ని కూడా ఆ వైద్య నిలయంలోనే గడపాలనెడి నిర్ణయానికి వస్తుంది.

ఆనంద్ కీర్తి దిశ దిశలా అలుముకుంటుంది. హైస్కూలు వార్షికోత్సవ సభలకు ఆనంద్‌నే అధ్యక్షునిగా యెన్నుకుంటారు. అతడు సమావేశానికి వెడుతూండే ముందొక వృద్ధురాలు గాయపడిన తన పనివాణ్ని తీసుకుని వస్తుంది. అత్యవసరంగా చికిత్స చేయమని ప్రాధేయపడుతుంది కాని చంద్ర – వేళా పాళా లేకుండా రావడం జూచి విసుక్కుంటూ మరునాటి ఉదయం రమ్మంటుంది. మేడ మీద నుంచి చూస్తున్న ఆనంద్ చరాచరా క్రిందికి వచ్చి-తిరిగి వెడుతూన్న ముసలిదాని వడిలోని కుర్రవాణ్ని తీసుకుని చికిత్స చేస్తాడు. ఆ రాత్రి తాను ఊరుకు వెళ్ళవలసిన ప్రయాణాన్ని కూడా మార్చుకుంటాడు.

చంద్రకు యీ పద్ధతి అంతగా నచ్చదు—'డాక్టరూ మనం ఎప్పుడు పడితే అప్పుడు యిలా వ్యాధిగ్రస్తులను చూస్తూంటే—అహర్నిశమూ పని చెబుతారు. అవతల అన్నపానాలనేది కూడా లేకుండా, చిక్కిశల్యమై, మనమూ రోగులమవుతాం' అంటుంది. అందుకు ఆనంద్ అయిదు నిమిషాల వరకూ సమాధానం చెప్పడు – చివరకొక నవ్వు నవ్వి – 'రోగాలనేవి చెప్పిరావు – వాటికి వేళ నేద ఉండదు. మనం వైద్యులం వైద్య సేవలో నిమగ్నులైన వారు వేళపాళాలను చూచుకుంటే తమ వృత్తికి న్యాయం కల్పించలేరు' అంటాడు. చంద్ర యిక ఏంటీ మాట్లాడలేకపోతుంది.

* * *

జన్మానికల్లా శివరాత్రి యని ఆ ఒక్కరోజే ఒక్కపూటే విశ్రాంతి చిక్కింది ఆనంద్‌కు. అదృష్టవశాత్తూ అది అతని పుట్టిన రోజు కూడాను. చంద్రను తన యింటికి పిలిచాడు. తన శ్రీమతి వంటకాలు రుచి చూడ రమ్మంటాడు. అంతవరకూ ఆనంద్ వివాహితుడు అన్న సంగతి చంద్రకు తెలియనే తెలియదు. తల్లి తండ్రుల మధ్య తిరుగాడుతున్నాడనీ, వివాహం కాలేదనీ భావిస్తూ

వచ్చింది. అక్కడ కూడ సంశయం తీరక 'ఆనంద్ బాబూ మీ రింకా వివాహం చేసుకోలేదా?' అంటుంది చంద్ర పదహారు పళ్లను బయట పడవేస్తూ,-

'భేషుగ్గా ఉంది ప్రశ్న—వివాహమే కాదు, ఒక బిడ్డకు తండ్రిని కూడా' అంటాడు ఆనంద్ తాను గృహస్థున్నని నొక్కి చెబుతూ-

చంద్రకు ఆ సమాధానం యెందువల్లనో బాధలను కల్గిస్తుంది. ఆనంద్ వివాహితుడు కావడంవల్ల వచ్చిన నష్ట మేమిటో తా నూహించలేకపోతుంది. ఎందుకలా బాధపడుతున్నానా అంటూ ఆత్మ వరీక్షను చేసుకుంటూ కొయ్య బొమ్మలా నిలుచుండి పోతుంది చంద్ర.

కారులో కూర్చున్న ఆనంద్ హారన్ వేసి వేసి— 'మిస్ చంద్రాణీ - రండి త్వరగా పోదాం' అంటాడు. ఇక తప్పనిసరి అనుకుంటూ ఆమె కారు వెనుక సీటులో కూర్చోబోతూంటే - ఫ్రంటు సీటులోకి రండి మేడమ్' అంటాడు ఆనంద్. ఆమె అలా కూర్చోవడలో గాలి యెగిరి పమిటచెంగు ఆనందంపై బడుతుంది. ఆ చెంగును తప్పించిపోయి ఆమె అతని బుగ్గలను స్పృశిస్తుంది. అందువల్ల ఆమెలో ఏక చైతన్యం కనబడదు. ఇతః పూర్వం కరస్పర్శచేసి (Shake hand) చేసినప్పుడే ఒళ్ళు పులకరించేది. ఇప్పుడా పులకరింపూలేదు. ఇలా ఆమెలో ఆమే యేదో తర్కించుకుంటూండగానే ఆనంద్ యిల్లు వస్తుంది.

గుమ్మంలోకి వెళ్ళేసరికి — ఆనంద్ భార్య రాధ చంద్రకు నిండు స్వాగతానిచ్చి సోఫా మీద కూర్చో మంటుంది. ఉచిత మర్యాదల అనంతరం భోజనానికి ఉపక్రమిస్తారు. ఆనంద్ కుమార్ ప్రేమ్ తప్పటడుగులు వేస్తూ రావడం జూచి-శ్రీమతి రాధగారూ ప్రేమ్ అచ్చు మీ పోలికేనండీ' అంటుంది.

'అలాగే ఆడవాళ్లూ ఆడవాళ్లూ కాబట్టి స్వజాతి అభిమానం పోనిచ్చుకున్నారుకాదు-' అంటాడు ఆనంద్ -

'పోనీ లెండి చెల్లమ్మ మిమ్మల్నే పొగిడించనుకోండి' అంటూ రాధ సర్ది చెప్పబోతూంటే - 'ఓహో యింకేం వరుసలు కూడా కలుపుకొని, మెజార్టీ పెంచుకుంటున్నావ్ - కానీ—' అంటాడు ఆనంద్.

అనంద్ అంత చనువుగా, చలాకీగా, చమత్కారంగా మాట్లాడడం - చంద్ర యెపుడూ చూడలేదు. భోజనాలూ, విశ్రాంతీ అయిన తరువాత—'వస్తానమ్మా అక్కయ్యా' అంటూ చంద్ర వచ్చేస్తుంటే - 'తరచు వస్తూండమ్మా' అంటుంది రాధ, 'అలాగే నంటూ' చంద్ర గృహోన్ముఖురాలవుతుంది.

* * *

తదుపరి చంద్ర తరచుగా యింటికి రావడం ఆనంద్‌లో ఆత్మీయంగా తిరగడం రాధ చూస్తూంటుంది. ఒక రోజు వాళ్ళిరువురూ రెండవ ఆట సినిమాకు వెళ్ళి - అర్ధ రాత్రి యింటికి వెళ్ళలేక సరాసరి ఆనంద్‌తో ఆమె ఆనంద్ యింటికే రావడం రాధకు కొంత బాధగా వుంటుంది. అయినా యేఁదీ అనలేక పోతుంది. ఆనంద్‌ను అనుమానించలేకపోయినా, చంద్ర మీద సెందుకో ద్వేషాన్ని పెంచుకుంటుంది.

ఒక రోజు చంద్ర వచ్చి రాధను 'మీరు చాలా అందంగా ఉన్నారు సుమా -' అంటుంది - దానికి రాధ వెంటనే సమాధానం యిస్తూ-మీ కళ్ళు నాకు లేవుగా- సౌందర్యోపాసం సలుపడానికి-' అంటుంది అందులో యెంతో నిగూఢార్థం యిమిడ వున్నా - చంద్ర యేఁదీ మాట్లాడలేకపోతుంది.

మరునాడు అనంద్ చంద్రతో సినిమాకు వెడుతూ రాధను కూడా రమ్మంటాడు. ఆమె రాలేనని చెబుతుంది. అయినా అతడు చింతించడు కదా - చంద్రను తీసుకుని సినిమాకు వెడతాడు. అలా వారిరువురూ కలిసి తిరగడం రాధ అనుమానానికి మరింత బలాన్ని చేకూరుస్తాయ్. అసూయా ద్వేషాలు రాధలో నానాటికీ విజృంభిస్తున్నాయ్. సమయం చూచుకొని భర్తను అడుగుదామనుకుంటుంది. కాని భర్తతో ఎవరో ఒకరు ఉండడం వలన అడగలేకపోతుంది. ఇలా వుంటూండగా రాధా అనంద్ లిరువురూ దసరా పండుగులకు మైసూరు స్నేహితులతో కలసి వెడతారు.

మైసూరునుంచి తిరిగి వచ్చేసరికి - అనంద్‌కు చంద్ర ఉద్యోగానికి రాజీనామా చేసిన ఉత్తరం ఒకటి - రాధ పేరిట మరొక కవరును కాంపౌండరు తీసుకు వచ్చి యిస్తాడు. అంత త్వరితంగా ఆమె ఉద్యోగాన్ని విడిచిపెట్టే కారణం అనంద్‌కు కనిపించదు—కాగితం తీసి చదువుతూ ఆడదాని బుద్ధి చంచలమైనది; నీటి బుడగలా తళతళ మెరసి విచ్చుకనిపోతారు' అంటాడు

ఆనంద్. ఆ మాటకు రాధ మనసు మరింత గాయపడు పడుతుంది-తొందరగా తొందరగా తన వుత్తరాన్ని లోపలికి తీసుకుపోయి-తలుపులు వేసుకుని చదువుతుంది-ఆ వుత్తరంలో యిలా వుంటుంది.

'అక్కయ్యా -

అక్కయ్యా అంటున్నానని అన్యదా భావించకండి. వయసులో ఎవరం పెద్దలమైనా బుద్ధిలో మీరే పెద్దలుగా కనిపిస్తున్నారు. మిమ్మల్ని చూచి - నేనో సత్యాన్ని గ్రహించగల్గాను. ఇంతవరకూ వైవాహిక జీవితం అంటే - ఒక నరకమనే భావన నాలో కల్గుతూండేది. అందుకే యెందరో రూపవంతులు, విద్యావంతులూ నన్ను వివాహమాడతానన్నా - అంగీకరించలేకపోయాను. జీవిత పర్యంతమూ ఒంటరిగానే ఉండిపోవాలని నిశ్చయించుకున్నాను. కాని మీ యింటికి వస్తూ పోతూండడం - మీ ప్రేమబాబు ముచ్చటలను చూస్తూ - మీ దంపతుల అన్యోన్యతను తిలకించడంతో వివాహం చేసుకోవాలనెడి అభిప్రాయం నాకూ కల్గింది. గృహిణీ జీవితమే శ్రేయోదాయకమైన దనెడి నమ్మకం నాలో కల్గింది. నాకున్న పూర్వాభిప్రాయం పరిపూర్ణంగా విచ్ఛిన్నమైంది.

మీరు నా పట్ల సోదరిగాక, జననిగా సౌజన్యతను ప్రసరింపచేశారు. ఆదర్శమూర్తియై నాలో ప్రేమ భావాన్నీ, మంచితనాన్నీ, కుటుంబ జీవితాన్నీ పొంగింపచేశారు. మీ మేలును నేను మరిచిపోను. ఇంతటిలో మీరు నన్ను మరిచిపోకుండా - నా ఉత్తరాలకు సమాధానం వ్రాస్తూ, నా గృహిణీ జీవితానికి తగిన సలహాల నిస్తూంటారని భావిస్తాను. తప్పక మీరు నా వివాహానికి వస్తారు కదూ -

మరువకండీ—మీ చెల్లెలు 'చంద్ర' - అంటూ ఆ ఉత్తరాన్ని ముగించింది. ఉత్తరం చూడగానే నాలోని హృదయభారం తొలగిపోయింది. చరచరా వెళ్ళి తలుపులు తీశాను. గుమ్మ వద్దనే మావారు నిలుచున్నారు. వారికీ వుత్తరాన్ని అందించాను. సాంతం చదివి వారో కన్నీటి బొట్టును కురిపించారు. నేనూ వారిని చూచి ఒకందుకు కన్నీటి బొట్లును రాల్చాను.

మరువారం పోస్టులో ధర్మమూర్తులు 'ఆనంద్ల రాధా, దంపతులకు—అంటూ చంద్ర పెళ్ళి శుభలేఖ వచ్చింది. మా యిరువురిలో ఈర్ష్యా ద్వేషాలను వెల్లడించిన నేను ఆదర్శమూర్తినా, సౌజన్యతోనూ, సామవస్యాన్నీ వెల్లడించిన మావారు 'ఆదర్శమూర్తు'లా?— ఏ ఒకరమో అయినపుడు - ఇద్దర్నీ 'ఆదర్శమూర్తు'గా పరకడిపెట్టి వ్రాయడంలో చంద్ర భావం యేమిటో మీరైనా చెబుదురూ!


## లాభదాయకమైన లఘు పరిశ్రమ ప్రారంభించండి

"అధునాతన కుటీర పరిశ్రమలు" (తెలుగు) పుస్తకంలో లాభదాయకమైన వివిధ పరిశ్రమలు వున్నాయి. ఈ పరిశ్రమలలో వున్నవారు చక్కటి లాభాలను ఆర్జిస్తున్నారు. ప్రతి పరిశ్రమను గూర్చి సంక్షిప్తమైన వివరాలు, ముడిపదార్థాలు లభించే చోట్లు, ముడిపదార్థం కొనుగోలుకు, వాయిదాల పద్ధతిన యంత్రాల కొనుగోలుకు ప్రభుత్వం యిచ్చే సహాయం యిందులో వున్నాయి. లఘు పరిశ్రమలు ప్రారంభించ దలచుకున్న వ్యక్తుల సమస్యలకు తగిన పరిష్కార మార్గాలు యిందులో వున్నాయి. పుటలు 878, సుమారు 800 బొమ్మలు, ధర రూ. 13. తపాలా రుసుము రూ. 1—60. ఫోన్ : 229835

COTTAGE INDUSTRY

(NA-100) P. B. No: 1262.

JAMUNA ROAD : : DELHI-6.